సబ్ కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కిరణ్మయి

బాన్సువాడ, ఆగస్టు 30 : బాన్సువాడ సబ్‌కలెక్టర్‌గా కిరణ్మయి కొప్పిశెట్టి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మొదటగా సబ్ కలెక్టర్ బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిరణ్మయి ఉస్మానియ దవాఖానలో వైద్యురాలిగా విధులు నిర్వహించారు. అటు ఉద్యోగం చేస్తూనే 2022 బ్యాచ్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. శిక్షణ ముగించుకొని బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కిరణ్మయికి ఆర్డీవో రాథోడ్ రమేశ్ పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయం సిబ్బంది సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, ప్రియాక, జగన్, సంతోష్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణిగా లక్ష్మీ ప్రసన్న..

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30: నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిణిగా ఏడీఏ లక్ష్మీ ప్రసన్న శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏడీఏగా పనిచేసిన ఆమెకు ఎల్లారెడ్డి ఏడీఏగా అదనపు బాధ్యతలను అప్పగించడంతోపాటు నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిణిగా నియమించారు. దీంతో బాధ్యతలను స్వీకరించిన ఆమెను ఎంపీడీవో ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ వినోద్, సిబ్బంది శాలువా కప్పి సత్కరించారు.

కేంద్ర టీఎన్జీవోస్ నాయకులకు సన్మానం

కామారెడ్డి, ఆగస్టు 30 : టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్, ముజీబ్ నిజామాబాద్ పర్యటనలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా వారిని శుక్రవారం కామారెడ్డి టీఎన్జీవోస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. వారిని కలిసిన వారిలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కేంద్ర సంఘం కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు పోచయ్య, లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీలు రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి

కామారెడ్డి, ఆగస్టు 30 : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కో కన్వీనర్ అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ వెంటనే రిపోర్టు విడుదల చేసేలా 30 శాతంతో ఫిట్మెంట్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెన్షనర్ల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను అన్ని వసతులతో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ కన్వీనర్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్‌తో దోమల నివారణ చర్యలు

కామారెడ్డి, ఆగస్టు 30 : జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో శుక్రవారం ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న మాట్లాడుతూ.. దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా కాలనీలో ఫాగింగ్ చేయించామన్నారు. కాలనీ వాసులు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయకుండా చెత్త బుట్టల్లోనే వేయాలని అన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- ఏరియా దవాఖాన సందర్శన

ఏరియా దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 30 : రోగులకు మెరుగైన సేవలు అందించాలని, జ్వరం కేసుల విషయంలో వైద్యులు సకాలంలో స్పందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. జిల్లాలో వైరల్ ఫీవర్, డెంగ్యూ కేసుల సంఖ్య పెరుగుతున్నందున జిల్లా దవాఖానలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అన్ని వార్డుల్లో తిరిగి ఇన్‌పేషెంట్లతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. దవాఖానలో మందుల కొరతను వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో ఏయే మండలాల నుంచి ఎక్కువ జ్వరం కేసులు వస్తున్నాయని ఆరా తీశారు. తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి దవాఖానలో శుభ్రతను పాటిస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన బాన్సువాడ సబ్ కలెక్టర్

బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా నియామకమైన కిరణ్మయి కొప్పిశెట్టి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు.

'యాంటిబయోటిక్స్ ఇవ్వొద్దు'

బీర్కూర్‌లో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి గిరీశ్‌కుమార్

నస్రుల్లాబాద్/భిక్కనూరు, ఆగస్టు 30 : రోగులకు యాంటి బయోటిక్, ఐవీ సెలైన్లు ఇవ్వకూడదని మండల వైద్యాధికారి గిరీశ్‌కుమార్ అన్నారు. బీర్కూర్‌లోని పీఎంపీ, ఆర్‌ఎంపీల వద్దకు శుక్రవారం వెళ్లి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. రక్త పరీక్షలు, మందులు అందించకూడదని సూచించారు. ఆయన వెంట ఎంపీవో మహబూబ్, ఆరోగ సిబ్బంది ఉన్నారు. భిక్కనూరులోని ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను మండల వైద్యాధికారి హేమిమా శుక్రవారం తనిఖీ చేశారు. డెంగ్యూ, విష జ్వరాలతో ఎవరైనా క్లినిక్‌కు వస్తే వారిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు పంపించాలని సూచించారు. అనంతరం మెడికల్ దుకాణాలను తనిఖీ చేశారు.

బస్వన్నపల్లిలో అన్నదానం

బస్వన్నపల్లిలో అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

రాజంపేట్/బాన్సువాడ రూరల్, ఆగస్టు 30 : మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో శుక్రవారం అయ్యలకు ఇచ్చుట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. బసవేశ్వర స్వామికి నైవేద్యం సమర్పించి అనంతరం గ్రామంలో అన్నదానం చేస్తామన్నారు. రాత్రి సమయంలో దేవుని విగ్రహాన్ని గ్రామంలో ఊరేగిస్తామన్నారు. అనంతరం గుడి వద్ద భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలం కోనాపూర్‌లోని విఠలేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ, ఆగస్టు 30 : బాన్సువాడ కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో శనివారం స్పాటు అడ్మిషన్లు తీసుకోనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూపులో ఎస్సీ విద్యార్థినులకు మాత్రమే 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు. 10వ తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా ఎంపిక చేస్తారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మాచారెడ్డి/భిక్కనూరు/కామారెడ్డి, ఆగస్టు 30 : మాచారెడ్డి, పాల్వంచ గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు మండలాల బీజేపీ నాయకులు ఆయా మండల కేంద్రాల్లో తహసీల్దార్, ఎంపీడీవోలకు శుక్రవారం వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాచారెడ్డి బీజేపీ మండలాధ్యక్షుడు బూస సురేశ్, పాల్వంచ మండలాధ్యక్షుడు అనిల్, నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్, మండలాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శివప్రసాద్‌కు ఫిర్యాదులను అందజేశారు. మండల కార్యవర్గ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు గణేశ్‌రెడ్డి, తిరుమలేశ్, మోర్చా అధ్యక్షులు లక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కామారెడ్డిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు రవి, రాజలింగం, భూపతి, బాలు, భాస్కర్, ప్రసాద్, విఠల్, భూపాల్, రాములు, పోచయ్య, గంగాధర్ అధికారులకు ఫిర్యాదులను అందజేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులతో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ, ఆగస్టు 30 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాన్సువాడలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. బాన్సువాడలో క్రీడామైదానం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డికి క్రీడాకారుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. బాన్సువాడలో నిర్వహించే క్రీడలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, నాయకులు అంజిరెడ్డి, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు హకీం, ఆమేర్ చాహూస్, వెంకటేశ్, గైక్వాడ్ రుక్మిణి, సిబ్బంది విజయభారతి, జగన్, ఉదయ్ గుప్తా, సొసైటీ డైరెక్టర్ రెంజర్ల సాయిలు, ఖాలేఖ్ తదితరులు ఉన్నారు.

బస్తీ దవాఖాన, గ్రంథాలయం పరిశీలన

బాన్సువాడలోని బస్తీ దవాఖాన, గ్రంథాలయాన్ని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పరిశీలించారు. మౌలిక వసతులు, మందులు తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు.

రిపుల్స్ పాఠశాలలో తెలుగుబాషా, జాతీయ క్రీడాదినోత్సవం

బాన్సువాడలోని రిపుల్స్ పాఠశాలలో జాతీయ, తెలుగు బాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, కులకర్ణి పాల్గున్, రవి, ర్యాల స్పందన, మామిళ్ల సంగీత తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఇంటింటి సర్వే

భిక్కనూరు, ఆగస్టు 30 : రుణమాఫీపై ఇంటింటి సర్వేను చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ అపర్ణ అన్నారు. బస్వాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ.రెండు లక్షల రుణమాఫీకానీ రైతుల వివరాలను సేకరించాలని అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాధారెడ్డి, ఏఈవో మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఉచిత ఆయుర్వేద వైద్యం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వయో వృద్ధులకు ఉచిత ఆయుర్వేద వైద్యం అందించినట్లు వైద్యుడు వెంకటేశం తెలిపారు. ఆయుర్వేద వైద్యంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. ఆయుర్వేద ఔషధాలు వాడే విధానాన్ని వివరించారు. శిబిరంలో సుమారు 70మంది రోగులకు మాత్రలను అందించారు. కార్యక్రమంలో డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30: రోడ్డు విస్తరణ పనుల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నాగిరెడ్డిపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో మండల కేంద్రంలోని వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడంలో భాగంగా విద్యుత్‌ను నిలిపివేశారు.

కనుమరుగైన 120ఏండ్ల మర్రిచెట్టు

మర్రి చెట్టు వద్ద గ్రామస్తులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30: మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాల ఎదుట రహదారి పక్కన ఉన్న 120 ఏండ్ల వయస్సు ఉన్న మర్రి చెట్టును రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం తొలగించారు. కాగా తాము చిన్నప్పుడు రోజూ పాఠశాలకు వచ్చి.. మర్రి చెట్టుకింద సైకిళ్లు పెట్టి.. ఆడుకున్న రోజులను పలువురు గుర్తుచేసుకున్నారు. చెట్టుకింద జామకాయలు, సోడా, మక్కజొన్న పొత్తులు, నేరేడిపండ్లు తిన్న క్షణాలను నెమరు వేసుకున్నారు. మర్రి చెట్టును తొలగిస్తున్నారని తెలియడంతో మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల పూర్వ విద్యార్థులు చెట్టును చివరగా చూసుకొని.. ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

గాంధారి, ఆగస్టు 30: గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో నేడు(శనివారం) శాంతి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాంధారిలోని హరాలే గార్డెన్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసే బాధ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నందివాడ ఘటనపై అధికారుల నిర్లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న విఠల్

ఎల్లారెడ్డి, ఆగస్టు 30: తాడ్వాయి మండలంలోని నందివాడ పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆరో తరగతి విద్యార్థి శరత్ కంటికి తీవ్ర గాయమైంది. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భారతీయ విద్యార్థి మోర్చా నాయకుడు విఠల్ ఆరోపించారు. నందివాడ పాఠశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థికి న్యాయం చేయాలని, విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించాలన్నారు.

ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలి

- గ్రామాల్లో పర్యటించిన అధికారులు
- పారిశుద్ధ్య పనుల పరిశీలన

గ్రామస్తులతో మాట్లాడుతున్న రామారెడ్డి మండల ప్రత్యేకాధికారి

ధూప్‌సింగ్ తండాలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఎల్లారెడ్డి, ఆగస్టు 31: ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలని అధికారులు సూచించారు. ఎల్లారెడ్డి, నిజాంసాగర్, రామారెడ్డి మండలాల్లో పర్యటించిన అధికారులు.. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్, సోమారిపేట గ్రామాల్లో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. శుభ్రత పాటించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్ కుమార్ ఉన్నారు. ఎల్లారెడ్డి బల్దియా పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆర్డీవో ప్రభాకర్, కమిషనర్ శ్రీహరిరాజు పరిశీలించారు.

మహ్మద్‌నగర్ మండలంలో ఎంపీడీవో..

నిజాంసాగర్, ఆగస్టు 30: మహ్మద్‌నగర్ మండలంలోని పలు గ్రామాలను ఎంపీడీవో గంగాధర్ సందర్శించారు. గిర్నితండా, దూప్‌సింగ్ తండాల్లో ఓటరు లిస్టు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. దూప్‌సింగ్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. బూర్గుల్ గ్రామ పంచాయతీలో ఓటరు లిస్టు, శానిటేషన్, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయనవెంట గ్రామ పంచాయతీ కార్యదర్శులు శిరీష, చరణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

రామారెడ్డి మండలంలో..

రామారెడ్డి, ఆగస్టు 30: రామారెడ్డితోపాటు ఇసన్నపల్లి ఉప్పల్‌వాయి గ్రామాలను మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రాజేశ్వర్ సందర్శించారు. వీధుల్లో తిరుగుతూ పలు ఇండ్లల్లో కుండీల్లో ఉన్న నీటిని పారబోయించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, మెడికల్ ఆఫీసర్ సురేశ్, సూపర్‌వైజర్ జానకమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

నినాదాలు చేస్తున్న మాదిగ కులస్తులు

మద్నూర్, ఆగస్టు 30: ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి మండలంలోని లచ్చన్ గ్రామంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. 30 ఏండ్లుగా మాదిగ జాతిని ఏకతాటిపై నిలిపి ఎస్సీ వర్గీకరణకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్, మండల అధ్యక్షుడు మారుతి, సలహాదారులు భీంరావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిచ్కుంద సీఐ జగదం నరేశ్

ఇతరులను కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు

బిచ్కుంద, ఆగస్టు 30: సోషల్ మీడియాలో మతాలతోపాటు ఇతరులను కించ పరిచే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని సీఐ జగదం నరేశ్ అన్నారు. బిచ్కుంద పోలీసుస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. సమావేశంలో ఎస్సై మోహన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తడి కాలువ మరమ్మతులకు రూ.50లక్షల మంజూరు

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

లింగంపేట, ఆగస్టు 30: మండల కేంద్రంలోని మత్తడి కాలువ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మత్తడి కాలువ శిథిలం కావడంతో విషయాన్ని నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.50లక్షలను మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడంతో స్థానిక నాయకులు శుక్రవారం హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు సంతోష్‌రెడ్డి, రఫిక్, ఫతీయొద్దీన్, రాంరెడ్డి, దశరథ్‌నాయక్, సంగమేశ్వర్ ఉన్నారు.

పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు..

మండల కేంద్రంలోని మత్తడి కాలువలో పేరుకు పోయిన పూడిక, పెరిగిన పిచ్చి మొక్కలను రైతులు శుక్రవారం శ్రమదానం చేసి తొలగించారు. లింగంపేట పెద్దవాగుపై నిర్మించిన మత్తడి కాలువ ద్వారా మండల కేంద్రంలోని ఊర చెరువుతోపాటు రెండు కుంటల్లో నీరు నిండుతుంది. మత్తడి కాలువ ద్వారా వచ్చిన వరదతో రైతులు వానకాలం, యాసంగి పంటలను సాగు చేస్తుంటారు. పిచ్చి మొక్కలు, పూడిక మట్టి పెరగడంతో నీటి ప్రవాహం తగ్గింది. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ.. రైతులే శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు.

అర్హులకు రుణమాఫీ అయ్యేలా చూస్తాం



పెద్దకొడప్‌గల్‌లో రైతుతో సెల్ఫీ దిగుడుతన్న ఏవో

నాగిరెడ్డిపేట/ పెద్దకొడప్‌గల్, ఆగస్టు 30: రేషన్‌కార్డులు లేకుండా, పేర్లు నమోదు కాని రైతులను నిర్ధారించి, అర్హులైన వారందరికీ రుణమాఫీ వచ్చేలా చూస్తామని ఎల్లారెడ్డి ఏడీఏ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని బొల్లారం, జప్తిజాన్కంపల్లి, రాఘవపల్లి గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ఏవో హరి వెంకట ప్రసాద్, ఏఈవోలతో కలిసి రైతులతో మాట్లాడి, సెల్ఫీ ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రశాంత్‌కుమార్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లోని రైతువేదికలో రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఏవో కిషన్ మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతుల ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఏఈవో మాధవి, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లింగంపేట, ఆగస్టు 30: మండలంలోని బాణాపూర్, బాయంపల్లి, కోర్పోల్ గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నరేందర్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులను పరిశీలించారు. ఓటర్లకు కావాల్సిన వసతులను కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం బాణాపూర్ గ్రామంలో ఓటరు సర్వేను పరిశీలించారు. ఆయనవెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, బీఎల్వోలు ఉన్నారు.

నేడు ఎల్లారెడ్డి డివిజన్ అంబేద్కర్ సంఘం ఎన్నికలు

లింగంపేట, ఆగస్టు 30: ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో శనివారం డివిజన్ స్థాయి అంబేద్కర్ సంఘం ఎన్నికలను నిర్వహించనున్నట్లు సంఘం డివిజన్ ఇన్‌చార్జి బిట్ల సురేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. డివిజన్ స్థాయి అంబేద్కర్ సంఘం సభ్యులతో సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశం అనంతరం డివిజన్ స్థాయి ఎన్నికలతోపాటు మండల, పట్టణ స్థాయి ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆయనవెంట అంబేద్కర్ సంఘం కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బబ్లూ, లింగంపేట మండల శాఖ అధ్యక్షుడు నీరడి సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ బండి రాజయ్య, ప్రధాన కార్యదర్శి వివేకానంద తదితరులు ఉన్నారు.

ఆదర్శ పనులను గుర్తించాలి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30 : మండలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో ఆదర్శంగా ఉన్న వాటిని గుర్తించి ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఏపీవో సాయిలు సూచించారు. మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సరీల్లో మిగిలిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. వాటి వివరాలను సిబ్బందిని అడిగి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు, విజయగౌడ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.